1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | అక్టోబర్ 28, 2024 | www.navatelangana.com

నకిలీ నోట్ల పేరుతో కలకలం



నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని అంక్సాపూర్ గ్రామ శివారు 63వ నంబరు జాతీయ రహదారి ప్రక్కన పారేసిన పిల్లలు ఆడుకునే కరెన్సీ నోట్లు నకిలీ నోట్లుగా కలకలం సృష్టించాయి. 100, 500 నోట్లు పారవేయగా, ఆ నోట్లను కొందరు ఏరుకోవడం చూసినవారు వాటిని నకిలీ నోట్లుగా భావించి వారికి పరిచయమున్న వాళ్లందరికీ చేరవేశారు. దీంతో ఈ విషయం అంతటా వ్యాపించి పలు వార్తా చానల్లో రోడ్ల పక్కన నకిలీ నోట్లు పారవేసినట్లు ప్రచారం జరిగింది. ఆ నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని రాసి ఉన్నప్పటికీ నకిలీ నోట్లుగా ప్రచారం చేయడం గమనర్హం. దీంతో స్థానిక పోలీసులు ఆరా తీసి చిన్నపిల్లలు ఆడుకునే నోట్లుగా గుర్తించారు.

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ బదిలీ



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాత బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసినట్లుగా సమాచారం. సుజాత కామారెడ్డి కమిషనర్‌గా ఈ సంవత్సరం ఫిబ్రవరి 15న బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డికి ఇంకా కొత్త కమిషనర్‌ను ప్రభుత్వం నియమించలేదు. కొత్త కమిషనర్‌గా ఎవరు వస్తారో అని మున్సిపల్ ప్రజలు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. కామారెడ్డి పరిధిలో ఉద్యోగం చేయాలంటేనే ప్రభుత్వ ఉద్యోగులు భయపడుతున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి

బీజేపీని తరిమికొడితేనే

మతోన్మాదం అంతం

- ఉద్యోగాలు కల్పించమంటే కులమత వైశమ్యాలు పెంచేయత్నం
- నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఎక్కడా..?
- కేంద్రానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి ప్రశ్న
- షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం
- పథకాల అమల్లో 'ప్రజాపాలన' అభాసుపాలు
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- నిజామాబాద్ జిల్లాలో ముగిసిన పార్టీ 23వ మహాసభలు
- ప్రజాసమస్యల పరిష్కారంపై అలుపెరగని పోరాటాలకు సంసిద్ధం



గానం ఆలపిస్తున్న సిర్ప లింగం

నవతెలంగాణ-కంఠేశ్వర్

'దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. ఉద్యోగాలు కల్పించమంటే కులమత వైషమ్యాలు పెంచుతోంది. మతోన్మాదంతో నిమ్నవర్గాలపై దాడులు చేస్తున్నారు. బీజేపీని తరిమికొడితేనే దేశంలో నుంచి మతోన్మాదం అంతమవుతుందని' సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి అన్నారు. సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా 23వ మహాసభలు రెండో రోజు ఆదివారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ప్రతినిధుల సభ నిర్వహించగా.. ముందుగా టి.జ్యోతి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలను తీసుకురావడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమే అని అన్నారు. కేంద్రం మతోన్మాద దాడులను పెంచుతూ నిమ్న వర్గాలపై దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాకు ఇచ్చిన పసుపు బోర్డు హామీ ఇచ్చిందని, జిల్లాలో ఎక్కడ ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. దీనికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దగ్గర సమాధానం లేదని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలను యుద్ధ ప్రాతిపదికనగా లెక్కించాలని అన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ అమలు చేయకుండా అభాసు పాలవుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీడీ పరిశ్రమ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, బీడి పరిశ్రమలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రతతో అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తన మానిఫెస్టోలో చేర్చిన బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించకపోవడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు పథకాలను అమలు చేయడంలో విఫలమవుతుందని ప్రజల ఆగ్రహాన్ని నిలవరించకపోతే తగిన గుణపాఠం చెబుతామని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించకపోతే భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించుతామని దానికి అనుగుణంగా ఈ జిల్లా మహాసభలో భవిష్యత్తు కార్యాచరణని రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో అనేక తీర్మానాలను ప్రవేశపెట్టి ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ రమ, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా సెక్రెటరీ మెంబర్లు పెద్ది వెంకట రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్ గౌడ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, పార్టీ జిల్లా నాయకులు సుజాత, యేషల గంగాధర్, రామ్మోహన్ రావు, కొండ గంగాధర్, నన్నెసాహెబ్, విఘ్నేష్, జంగం గంగాధర్, ప్రజానాట్యమండల జిల్లా కార్యదర్శి శిల్ప లింగం నాయక్ వాడి శ్రీనివాస్, కటారి రాములు, తదితర నాయకులు పాల్గొన్నారు.



రెండో రోజు మహాసభకు హాజరైన పార్టీ ప్రతినిధులు

రేపు విజ్ఞప్తుల స్వీకరణ

- బీసీ కమిషన్ బృందానికి ఘన స్వాగతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉమ్మడి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్న తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఆదివారం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద బీ.సీ కమిషన్ బృందానికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలు విచ్చేయగా, అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా అధికారులతో భేటీ అయ్యి స్థానిక పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం బీసీ కమిషన్ బృందం సభ్యులు శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం సందర్శన కోసం బాసర పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణను పూర్తి చేసుకుని తిరిగి నిజామాబాద్ కు చేరుకోనున్న బీ.సీ కమిషన్ బృందం స్థానికంగా రాత్రి బస చేయనుంది. ఈ నెల 29 (మంగళవారం) ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి అభిప్రాయ సేకరణ జరుపనున్నారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 4.00 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషాపై తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా కమిషన్ కు నివేదించవచ్చని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. స్వాగతం పలికిన వారిలో బీసీ అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రానికి విచ్చేసినా కమిషన్ బృందం



నల్లవెల్లికి లైన్‌మెన్‌ను కేటాయించారా..?

- ప్రస్తుతం ఉన్న లైన్‌మెన్ బదిలీ
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, రైతులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



గ్రామంలో విద్యుత్‌కు సంబంధించి మంచికి చెడుకు చేదోడు వాదోడుగా ఉన్న లైన్‌మెన్ బదిలీ కాగా.. మరొకరిని కేటాయించకపోవడంతో గ్రామస్తులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో మొత్తం 158 గృహ, వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. దీనిలో 2161 గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లు కలిగి ఉన్నాయి. గ్రామంలో దాదాపు 13 ట్రాన్స‌ఫార్మర్లు ఉండగా, వ్యవసాయానికి సంబంధించిన 145 ట్రాన్స‌ఫర్మర్‌లు రేయింబవళ్ళు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇదే కాకుండా దీని పరిధిలో 11 కెవి విద్యుత్ ఫిడర్లు 4 ఉన్నాయి. నల్లవెల్లి ఒక్క గ్రామమే కాకుండా స్టేషన్ తండా గ్రామ పంచాయతీ, దాని పరిధిలోని క్యాబిన్ తండా ఉంది. ఒక్క లైన్‌మెన్ ముడు చోట్లా చుడవలసి ఉంటుంది. ఒక లైన్‌మెన్‌కు తోడుగా ఒక జూనియర్ లైన్‌మెన్ ను సైతం కేటాయించారు. తిర్మన్‌పల్లికి లైన్‌మెన్‌గా శ్రీనివాస్ కొనసాగారు. అయితే సాధారణ బదిలీల్లో భాగంగా మరోచోటుకు బదిలీ చేశారు. ఈ నెల 15వ తేదీన బదిలీ చేసి ఖాళీ అయిన ఆ స్థానంలో ఇతరులను కేటాయించకపోవడంతో అంత భారం జూనియర్ లైన్‌మెన్‌పై పడుతుంది.

గ్రామానికి లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ అత్యవసరం. ఆయా గ్రామాలలో జరగరానిది ఏదైనా ఘటనలు జరిగితే ఎవరు బాధ్యులని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇంత పెద్ద గ్రామంలో ఒక జూనియర్ లైన్‌మెన్ ఏ మేరకు రానిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనికి సమాధానం సైతం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

సాగుకు గ్రామం పెట్టింది పేరని, ఇక్కడ వరి, మక్క, ఆరుతడి పంటలు, పసుపు ఇతరత్రా పంటలు పండిస్తారు. ఎప్పుడైనా ఏదైనా అనుకోని ఘటనలు జరిగినప్పుడు లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు " నవతెలంగాణ" కు వివరించారు. ఇకనైన తెలంగాణ నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అధికారులు స్పందించి వెంటనే లైన్‌మెన్ నియామకం చేపట్టి గ్రామంలో, వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సమస్యకు ఏలాంటి ఇబ్బందులు, ఆటంకం కలగకుండా చుడాలని పలువురు గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఆదాయం ఇస్తున్నా..

వసతులు కల్పిస్తలే

- ఐఎంఎల్ డిపోలో కార్మికులకు కనీస వసతులు మృగ్యం
- చెట్ల కిందే భోజనాలు.. ఆరు బయటే మల మూత్ర విసర్జన
- ప్రభుత్వాలు మారినా వారి కష్టాలు తీరట్లే
- రోజుకు రూ.5 కోట్ల మద్యం సరఫరా



నవతెలంగాణ-మాక్లూర్

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐఎంఎల్ డిపో కొనసాగుతోంది. ఈ డిపో నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని 151 వైన్స్‌లకు, 29 బార్లకు నిత్యం మద్యం సరఫరా అవుతోంది. ఇందులో 80 మంది కార్మికులు తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ డిపో ద్వారా రోజుకు 4 నుండి 5 కోట్లు, నెలకు సుమారుగా 150 కోట్ల రూపాయల విలువైన మద్యం ఇక్కడి నుంచి కార్మికులకు తరలిస్తుంటారు. ఇంత చేస్తున్నా.. సదరు డిపో వద్ద కార్మికులకు కనీస వసతులు కానరావు.

ఆదాయం ఇచ్చే వారికి అవసరాలు కరువు

రాష్ట్రానికి అత్యధికంగా ఆదాయం తెచ్చే బేవరేజ్ మొదటిది. కానీ అందులో తమ శక్తిని మొత్తం ఖర్చు చేసే హమాలీల(కార్మికులకు) సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం చొరవ చూపడంలేదు. డిపోలోని కార్మికులు ఒంటికి, రెంటికి వస్తే ఆరుబయటకు పరుగుతీయాల్సిందే. వారికి ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేవు. భోజనశాల లేక చెట్లకిందనే భోజనాలు చేస్తూ.. అక్కడే సేద తీరుతున్నారు. వర్ష కాలం వచ్చిందంటే బేవరేజ్ డిపో మొత్తం బురద, నీటితో నిండిపోతుంది. దీనితో కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే పనులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా హమాలి కార్మికుల సమస్యలు సమస్యలుగానే ఉండిపోతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా తీసుకొచ్చిన లిక్కర్, విస్కీ, బీర్ డబ్బాలు పట్టుబడ్డప్పుడల్లా.. మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గల బ్యావరేజ్ గేజ్ గోదాంలో డిపో మేనేజర్, ఎక్సైజ్ ఎస్సై ఆధ్వర్యంలో నిలువ చేస్తారు. వారి సూచనాలతోనే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని వివిధ వైన్స్ లకు, బార్లలకు సరఫరా చేస్తారు. ఈ మద్యం ప్రతి నిత్యం సుమారు రు. 5 కోట్ల విలువ గల డబ్బాలు కార్మికులు సరఫరా చేస్తారు.

పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదు

ప్రభుత్వానికి కోట్ల ఆదాయం తెచ్చేందుకు తమ శక్తిని దారపోస్తున్న హమాలీ కార్మికులకు ఇప్పటి వరకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం. కార్మికులు తమ యుక్తిని, శక్తిని వినియోగిస్తున్నా.. వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి తమ గోడు ఆలకించి కనీస వసతులు కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే కార్మికుల సమస్యల తీరుతాయి

డిపో పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలు త్వరలోనే తీరుతాయి. నూతన గోదాం, భోజన శాల, బాత్ రూమ్స్ కొత్తగా నిర్మించడానికి టీఎస్ ఎం ఎస్ ఐ డి సి ఆధ్వర్యంలో 10 కోట్ల 30 లక్షల రూపాయలకు అంచనా వేశాం. త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి.

ఐఎంఎల్ డిపో మేనేజర్ గురువయ్య

కార్మికులకు వసతులు కల్పించాలి

ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న హమాలీ కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించారు. పనిప్రదేశంలో వారికి కనీస వసతులు కల్పించాలి. వారికి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి. లేకుంటే ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమాలు చేపడతాం.

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొండ గంగాధర్



డిపో నుంచి వైన్స్‌లకు తరలించేందుకు సిద్దంగా ఉన్న మద్యం కాటన్‌లు



నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | అక్టోబర్ 28, 2024 | www.navatelangana.com

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని రాంపూర్ డి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి మోతె భూమన్న అంత్యక్రియలకు నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్‌తో పాటు తదితరులు పాల్గొని పాడె మోసారు. ఈ సందర్భంగా వారు మృతుని కుటుంబ సభ్యులకు ఓదార్చారు. పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని అన్నారు. తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆయన ఎంపిటిసిగా చేశారు. మోతే భూమన్న మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జెనిటిక్ డిసార్డర్స్‌పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్ సహారా, శ్రీ ధన్వంతరీ ఫెటల్ మెడిసన్ సెంటర్, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జెనిటిక్ డిసార్డర్‌పై నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ ధన్వంతరీ హాస్పిటల్ హైదరాబాద్ రోడ్‌లో ఆదివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఫెర్నాన్‌డేజ్ హైదరాబాద్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ జ్యోష్న, డాక్టర్స్ ప్రశాంత్, డాక్టర్ మాధవి హాజరయ్యారు. డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ జన్యుపరమైన సమస్యలపై ఏ జాగ్రత్తలు తీసుకోవాలా క్షుణ్ణంగా వివరించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ.. గర్భస్థ శిశువుకు రోగాలను గుర్తించే సమయం, స్కానింగ్ ఏ సమయంలో చేయాలనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విజనంద్, కార్యదర్శి ధనుంజయరెడ్డి, రామారావు, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ లయన్ ఉదయ సూర్య భగవాన్, డైరెక్టర్ పోశెట్టి, కోఆర్డినేటర్ వినోద్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- డాక్టర్ సిఎస్ చైతన్య



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పట్టణానికి చెందిన నిత్య ఈఎన్‌టి సర్జన్ డాక్టర్ సిఎస్ చైతన్య తెలిపారు. ఆదివారం నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యంగా జబ్బు గురించి డాక్టర్‌తో మాట్లాడేటప్పుడు నిజాయితీగా ఉండాలని సూచించారు. మనసు విప్పి వివరించాలని, జబ్బు లక్షణాలు, అలవాట్లు, భయాలు, ఆందోళనలను దాచుకోవద్దని తెలిపారు. ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం చలికాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా చిన్నపిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పెరుగు, అరటిపండు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీముల తినిపించవద్దని, స్విమ్మింగ్, వాటర్ గేమ్ తక్కువగా చేయాలని, ఫ్రిడ్జ్ వాటర్ తాగవద్దని, ఫ్రిడ్జ్‌లో నిల్వ పదార్థాలను తీసుకోవద్దని, వాతావరణంలో మార్పుల వల్ల చిన్నపిల్లలకు కోల్డ్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని అన్నారు. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్ వాడకం చేయవద్దని దీంతో చెవికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అత్యాధునికమైన పరికరాలు ద్వారా చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిర్ధారణ చేసి ఇండోస్కోపీ మైక్రోస్కోపీ మైక్రో డి బ్రైడర్ ద్వారా ఆపరేషన్లు చేయనున్నట్టు తెలిపారు.

గొంతు ఇన్ఫెక్షన్..

చాలామందికి గొంతు ఇన్ఫెక్షన్స్ వస్తుందని.. సైనసైటీస్‌తో చాలామంది దీర్ఘకాలికంగా బాధపడుతున్నారని ఇలాంటి వారికి ఎండస్కోపీ ద్వారా కుట్లు లేకుండానే శస్త్ర చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమస్యలతో బాధపడేవారు చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. చెవి, ముక్కు సంబంధిత సమస్యలతో బాధపడేవారు సత్వరమే ఈఎన్‌టి వైద్యుడిని సంప్రదించాలని తెలిపారు.

ఆవు హల్‌చల్.. పలువురిపై దాడి



పలువురిని గాయపర్చిన ఆవు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో ఆవు హల్‌చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుజూసింది. వివరాలిలా ఉన్నాయి.. జానకంపేట్ గ్రామంలో ఓ ఆవు స్థానిక గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఆవు గ్రామంలోని ప్రధాన వీధుల్లో సంచరిస్తూ కనపడిన వారందరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అలాగే ప్రయాణిస్తున్న వారిపై సైతం దాడి చేసింది. రోడ్డు ప్రయాణించే ఆటోలపై, ద్విచక్రవాహనాలపై దాడి చేయడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని గ్రామస్థులతో కలిసి ఆవును బంధించారు. వెంటనే ఎడపల్లి మండల పశువైద్యాధికారికి సమాచారం అందించడంతో ఆయన జానకంపేట్ గ్రామానికి చేరుకున్నారు. ఆవు దాడిచేయడంతో ఆయన అన్ని కోణాల్లో పరిశీలించి.. ఆవుకు గత కొన్ని నెలల క్రితం కుక్కలు గాయపరచడం వల్ల రేబీస్ వ్యాధి సోకిందని వైద్యులు నిర్ధారించారు. వ్యాధి తీవ్రత పెరగడంతో ఆవు ఇలా ప్రవర్తించి ఆటోను ఢీకొట్టడంతో చివరికి ఆవుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆవు చివరికి ప్రాణాలు కోల్పోయింది.

కమ్యూనిస్టు యోధుడి
వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

భారత విప్లవోద్యమ కమ్యూనిస్టు యోధుడు ప్రజాపంథా మార్గదర్శకుడు అమరుడు కామ్రేడ్ డీవీకే స్మారక విగ్రహావిష్కరణ వచ్చేనెల 9న ఉంటుందని సిపిఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు వి.ప్రభాకర్, దేవారం తెలిపారు. ఆదివారం డీవీకే విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 53 సంవత్సరాలు విప్లవోద్యమ నిర్మాణంలో అలుపెరగకుండా ఉద్యమించిన వీరుడని కొనియాడారు. మితవాదాన్ని వ్యతిరేకించే సమయంలో అతివాద ప్రమాదం ఉంటుందని అతివాదాన్ని అధిగమించే ప్రయాణంలో మితవాద ప్రమాదం ఉంటుందని గుర్తించి ప్రజలే చరిత్ర నిర్మాతలని ప్రజాపంథా మార్గమని పార్టీలో అంతర్గతంగా అనేక సైద్ధాంతిక పోరాటాలు కొనసాగించారని తెలిపారు. ఈ నేపథ్యంలో అనేక అవమానాలకు, అవహేళనలకు గురైన వెనుకడుగు వేయలేదని గుర్తుచేశారు. సంక్షోభాలు, సుడిగుండాల నుంచి ఎదురీదిన ఉక్కుమనిషి అని కొనియాడారు. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి మనకు భౌతికంగా దూరమైనప్పటికీ అన్న చూపిన ప్రజాపంథా మార్గం ఉందని ఆ మార్గంలో ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. కామ్రేడ్ డివికె విగ్రహావిష్కరణ సభ నవంబర్ 9న పట్టణంలో ఉంటుందని ఈ సభకు కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ కేజీ రామ్‌చందర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, ప్రజా సంఘ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ముత్తన్న, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, యు.రాజన్న, శేఖర్, ఠాకూర్, శ్రీనివాస్, నిఖిల్, పిడిఎస్‌యు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆహా దేశీ చికెన్

- నాటుకోడి కూరకు ప్రసిద్ధి అంకాపూర్ - పాకశాస్త్ర ప్రావీణ్యులు ఎంతోమంది



నవతెలంగాణ-ఆర్మూర్

వ్యవసాయ అభివృద్ధిలో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన గ్రామం మండలంలోని అంకాపూర్. జిల్లా కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పక్కన పచ్చని పంట పొలాలతో అలారాలుతూ కనిపిస్తుంది. ఈ గ్రామ రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ ఎంతో ప్రగతి సాధించారు. అందరూ ఐక్యతతో సాగుతూ గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టారు. గ్రామంలో అభ్యుదయ రైతులతో పాటు పాకశాస్త్ర ప్రావీణ్యులు ఉన్నారటంలో ఆశ్చర్యం లేదు. అందుకే నాటుకోడి కూరకు సైతం అంకాపూర్ ప్రసిద్ధి చెందింది.

ఫంక్షన్లకు సైతం



నమ్మకంతో ప్రత్యేకంగా దేశి చికెన్‌ను గత 20 ఏండ్లుగా వండిస్తున్నా. ఫంక్షన్లకు సైతం 50 కిలోల నుండి క్వింటాలు వరకు అంకాపూర్ చికెన్‌తో పాటు పకోడీ, మటన్, సైతం ఆర్డర్‌పై వండి ఇస్తాం. విదేశాలకు సైతం చట్నీల రూపంలో చేసి ఇస్తాం.

- మల్లూరి రాజు,
బన్నీ ఆర్డర్‌మెస్, అంకాపూర్.

ఆదర్శ గ్రామం కావడం అదృష్టం



దేశంలోనే మా గ్రామం ఆదర్శ గ్రామం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో నిర్విరామ కృషి చేస్తున్నారు మా రైతులు. అలాగే అంకాపూర్ నాటుకోడి కూరకు ప్రత్యేకత ఉంది. ఇందులోనూ పేరుగాంచింది.

- డి.సి. సురేష్‌రెడ్డి, అంకాపూర్.

ప్రముఖులకు సైతం నాటుకోడి రుచి..

గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైయస్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రముఖులు జిల్లాకు వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు వారి భోజనాల మెనూలో ప్రత్యేకంగా అంకాపూర్ నాటుకోడి కూర వంటకం తప్పనిసరిగా ఉండేలా చూస్తారు. కోడికూర రుచి చూడాలని ప్రత్యేకంగా కోరడమే కాకుండా దగ్గరుండి వడ్డిస్తారు. ఒకసారి రుచి చూసిన వాళ్లు మళ్లీ మళ్లీ తినాలనుకుంటారు. ఈ ప్రాంతానికి వచ్చిన దేశ, విదేశీ ప్రముఖులంతా అంకాపూర్ నాటుకోడి కూర రుచి చూసినా వారే అంటే అతిశయోక్తి కాదు. దేశీయ మసాలాలు, ఆ దినుసులతో ఇక్కడ వండిన కోడి కూర ఇతర జిల్లాలు రాష్ట్రాలతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి అవుతుంది. దేశీ నాటుకోడి ఒకటి 650 ధరతో ఫోన్ చేస్తే చాలు తీసుకొచ్చి ఇస్తుంటారు. గ్రామంలో 30 మందికి పైగా దేశీ చికెన్ వండుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఆహా ఏమి రుచి అంకాపూర్ దేశి చికెన్ అంటూ లొట్టలు వేసుకొని తినొచ్చు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం..

2014 ఆగస్టు 7న అంకాపూర్ గ్రామానికి వచ్చిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా ఆహా అనిపించే అంకాపూర్ నాటుకోడి కూర విషయం చెప్పడం విశేషం. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఒకసారి వస్తే నాటుకోడి కూర అన్నం వండిపెట్టారు. నోరూరించే దేశీ చికెన్ మరచిపోలేము అన్న ఆయన మాటలను మర్చిపోలేము.

ఒకే ఇంట్లో ఇద్దరికి ఎంబీబీఎస్

- పట్టుబట్టి ఎంబీబీఎస్ సాధించిన అక్కా తమ్ముడు
- వీరు యువతకు ఆదర్శం



ఎంబీబీఎస్ సీటు సాధించిన అక్కా తమ్ముడు

నవతెలంగాణ-బోధన్

నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఎందరో ప్రయత్నించి విఫలమవుతున్నారు. కానీ ఈ అక్కాతమ్ముడు వారి పేదరికాన్ని లెక్క చేయలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించి శభాష్ అనిపించుకున్నారు.

సాలూర మండల కేంద్రంలోని దళిత కుటుంబానికి చెందిన సాలెన్ సంజీవ్, సాలెన్ నిర్మల దంపతులకు సాయిశ్వేతశ్రీ, సాయి నిహార్, సాయి మానస్ ముగ్గురు పిల్లలు. వారిలో సాయిశ్వేతాశ్రీ, సాయి నిహార్ పదవ తరగతి వరకు బోధన్ పట్టణంలోని విజయమేరీ హైస్కూల్‌లో కలిసి చదివారు. అనంతరం సాయిశ్వేతాశ్రీ ఇంటర్ ధర్మారంలో (సీఓఈ), సాయి నిహార్ కరీంనగర్(సీఓఈ)లో, సాయి మానస్ పాలిటెక్నిక్ కంప్యూటర్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదివారు. అప్పటి నుంచి డాక్టర్ కావాలనే సంకల్పంతో అక్కా తమ్ముడు నీట్ పరీక్ష రాశారు. ఉత్తమ ర్యాంకు సాధించడానికి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకున్నారు. అందులో భాగంగా సాయిశ్వేతాశ్రీ 3వ సారి నీట్ పరీక్ష రాసి (ఎస్సీ కేటగిరిలో) ఆల్ ఇండియా స్థాయిలో 2.65 ర్యాంకు సాధించింది. సాయి నిహార్ 2వ ప్రయత్నంలో ఆల్ ఇండియా(ఎస్సీ కేటగిరీలో) స్థాయిలో 1.80 లక్ష ర్యాంకు సాధించాడు. ఉత్తమ ర్యాంకులు సాధించిన ఈ అక్క, తమ్ముడు ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించారు. సాయి శ్వేతాశ్రీ కరీంనగర్‌లోని చల్మేడ ఆనందరావు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో, సాయి నిహార్ ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో ప్రస్తుతం జాయిన్ అయ్యారు. ఒక నిరుపేద దళిత కుటుంబంలో నుంచి ఇద్దరు అక్క, తమ్ముడు ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు ఎంబీబీఎస్‌లో జాయిన్ అయిన వారు ఆర్థిక ఇబ్బందులతో చిన్న రేకుల షెడ్డులోనే వారు నివసిస్తున్నారు. పేదరికాన్ని లెక్క చేయకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించిన ఈ కుటుంబం ఎందరికో ఆదర్శం.

మత్తు డాక్టర్ల అధ్యక్షులుగా డిప్యూటీ డిఎంహెచ్ఓ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి మత్తుడాక్టర్ల సమావేశంలో పాల్గొన్నారు. కాగా రాష్ట్ర మత్తు డాక్టర్ల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.



కూరగాయల సాగు.. బహుబాగు



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్ సమీపంలోనున్న నవదుర్గ ఆలయం ఎదురుగా ఫెరోజుద్దీన్ అనే రైతు కూరగాయల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సుమారు మూడు ఎకరాల భూ విస్తీర్ణంలో వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తున్నారు. ఈ మూడు ఎకరాల భూమిలో కాలీఫ్లవర్, టమాట, ఉల్లి, వివిధ రకాల పూలను నాటి తమ కుటుంబ పోషణ కొనసాగిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పంటలు ఎలాంటి చీడపీడలు ఆశించకుండా ముందు జాగ్రత్తగా స్ప్రే మందులు వాడి సమయానుకూలంగా వాటికి రసాయనికి మందులు అందజేస్తూ పంటను కాపాడుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.



నీరు పోస్తున్న రైతు

క్షత్రియ ప్రాంతీయ సమాజ్
రాష్ట్ర అధ్యక్షునిగా విశ్వనాధ్ రవీందర్

- రెండవసారి ఏకగ్రీవ ఎన్నిక



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా రిటైర్డ్ ఐజీపీ విశ్వనాథ్ రవీందర్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలో సికింద్రాబాద్ క్షత్రియ సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొదట ప్రాంతీయ క్షత్రియ (ఖత్రి/పట్కర్) సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాధ్ రవీందర్, విశిష్ట అతిథిగా విచ్చేసిన అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాధ్ బాలకిషన్ జ్యోతి ప్రజ్వాలన చేసి సహస్రార్జున చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాధ్ రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ కులస్తులలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యతను రూపుమాపడానికి చారిత్రాత్మకంగా "మిషన్ ఉథాన్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని, అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సమాజ్‌ల నుంచి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 30 గుంటల స్థలంలో సమాజ్ భవన్ నిర్మాణ పనులు కొసాగుతున్నాయని, స్లాబ్ పనులు పూర్తయ్యాయని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సలహాదారులు, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాధ్ బాలకిషన్ మాట్లాడుతూ సమాజ్ అభివృద్ధి చెందాలంటే విద్య చాలా అవసరమని, ఐకమత్యముతో సమాజ్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యవర్గ పదవి కాలం ముగిసినందున కొత్త అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియ నిర్వహించడానికి ఎన్నికల అధికారులుగా కర్తన్ చంద్ర శేఖర్, సిరిగిరి రామ్ కిషన్ వ్యవహరించారు. ఈ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సభల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులు నిర్వహించిన ఎన్నికల్లో నూతనంగా క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన విశ్వనాథ్ రవీందర్‌కు పట్టణ క్షత్రియ సమాజ్ తరపున అధ్యక్ష కార్యదర్శులు ఆర్మూర్ పట్టు శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

అ"పూర్వ" విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 2004-2005 సంవత్సర పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం బృందావనం ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు దాదాపు 20 వసంతాల తర్వాత అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు తమ మనోగతం, ఉపన్యాసాలు ఇచ్చారు. విద్యార్థి దశ మధుర క్షణాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరసయ్య, నారాయణ, శివశంకర్, సుమన, రాధ, పద్మజ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి

చేప పిల్లల పంపిణీ



చేపపిల్లలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి లో ఆదివారం తెలంగాణ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై అందిస్తున్న చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వం పూర్తి సబ్సిడీపై చేప పిల్లలను అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మత్స్యకార అధికారిణి శ్వేత,మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు లక్ష్మా గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, కాంగ్రెస్ నాయకులు రంజిత్, నామాల రవి, నామాల లింబాద్రి, బి పేట నర్సింలు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని జీవీఎస్ కళాశాల ఎదుట ఉన్న రోడ్డు డివైడర్ ను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేయటం జరిగిందనీ వెంటనే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకొని డివైడర్‌ను నిర్మిచాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ కోరారు. ఆదివారం కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైడర్ కొల్చివేత విషయంలో విచారణ జరిపి కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అంతే కాకుండా ప్రమాదాలు జరగకుండా వెంటనే కూల్చివేతకు గురైన డివైడర్ ను నిర్మించాలని డిమాండ్ చేశారు.

'మహాలక్ష్మి'కి తగ్గుతున్న గౌరవం

- పలు బస్సుల్లో సీట్ల వ్ద 'స్త్రీలు' స్టిక్కర్ల తొలగింపు
- మహిళలపై ఇప్పటికే బస్సుల్లో ఈసడింపులు..
- ఆర్టీసీ చర్యలతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మహాలక్ష్మి పథకం.. మహిళలకు ఎంత ప్రయోజనం కల్పిస్తుందో అంతే అవమానాలకు గురిచేస్తుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పేరుతో గతేడాది డిసెంబర్ 9వ తేదీ నుంచి పథకం ప్రారంభించింది. ఈ పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణాలకు మహిళలకు ఆర్థిక భారం తప్పినట్లైంది. ఎంతో మంది మహిళలు లబ్ధి



ఆర్మూర్ బస్టాండ్..



సీట్ల వద్ద ఉన్న 'స్త్రీలు' అనే పదం తొలగింపు



బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

చేకూర్చుకుంటున్నారు. ఇదంతా నాణానికి ఒక వైపు. రెండో వైపు చూస్తే.. మహిళలకు ప్రయాణ సమయాల్లో అనేక ఇక్కట్లు ఎదురుకుంటున్నారు. సరిపడా బస్సులు పెంచక పోవడంతో రద్దీ పెరిగింది. వీటంతటికి కారణం మహిళలే అని అటు ఆర్టీసీ సిబ్బంది నుంచి, తోటి ప్రయాణికుల నుంచి చీవాట్లు, వెక్కిరింతలు, ఈసడింపులు నిత్యకృత్యం అయ్యాయి. దీంతో అనేక ప్రయాసలకోర్చి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కానీ తాజాగా ఆర్టీసీ చేపడుతున్న చర్యలు సైతం మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉన్నాయి. గతంలో బస్సుల్లో మహిళలకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించేవారు. ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో డ్రైవర్ వెనుకాల గల సీట్ల వద్ద 'స్త్రీలు' అని రాయించి ఆ సీట్లను ప్రత్యేకంగా వారికోసమే కేటాయించేవారు. దీంతో ఆయా సీట్లలో పురుషులు కూర్చుంటే మహిళలు వచ్చిన సమయంలో వారికి సీటు కేటాయించేవారు. కానీ ప్రస్తుతం కొన్ని బస్సుల్లో ఆ సీట్ల వద్ద ఉన్న 'స్త్రీలు' అనే పేరు తొలగించడం గమనార్హం. దీంతో ఆ సీట్ల లో ఎవరైనా కూర్చునే వెసులుబాటు కలిపించినట్లైంది. ఈ చర్య పట్ల మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సమాజంలో మహిళల పట్ల చిన్న చూపు ఉందని, అలాంటి సమయంలో ఇలాంటి చర్యలు చెప్పట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరి ఆర్టీసీ బస్సులో మహిళల కోసం ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

బీసీ కమిషన్ విజ్ఞప్తుల స్వీకరణను వినియోగించుకోండి

నవతెలంగాణ-మద్నూర్

అక్టోబర్ 28 నుండి 13 నవంబర్ వరకు 17 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కమిషన్ పర్యటన చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోని నాయకులు బీసీలకు కావలసిన వివిధ అంశాలపై విజ్ఞప్తులను సమర్పించుకోచ్చని తహసీల్దార్ ఎమ్‌డి ముజీబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఇరు కలెక్టరేట్‌లలో అందుబాటులో ఉంటారని తెలిపారు. కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు, పారిశ్రామిక రంగంలో సబ్సిడీలు భూముల కేటాయింపులు, విద్యా ఉద్యోగ ఉపాధి రంగంలో బీసీల జనాభా దామాషా రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, బడ్జెట్లో వాటా, వివిధ కులవృత్తుల వారికి/సేవా కులాల వారికి ప్రత్యేక సబ్సిడీ పథకాలు, బీసీ కులాల ఉత్పత్తిలకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రత్యేకమైన సెజ్ లు, బీసీ కులాల వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం వంటి అంశాలతో పాటు కులాల వారీగా సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. కాబట్టి మద్నూర్ మండల బీసీ కులాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ కోరారు.

బదిలీపై వెళ్లిన లైన్మెన్‌కు సన్మానం



లైన్‌మెన్‌ను సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూరు గ్రామంలో గత 13 సంవత్సరాలుగా లైన్‌మెన్‌గా సేవలందించి బదిలీపై వెళ్లిన అమ్రు నాయక్‌ను ఆదివారం సన్మానించారు. మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తదితరులు శాలువతో సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగ ప్రజలతో ముడిపడి ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేసి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

ఓయూ జెఏసి అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

ఓయూ జెఏసి వ్యవస్థపాక అధ్యక్షులు రాజారామ్ యాదవ్‌ను ఆదివారం బంటు భూమేష్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సంఘం కామారెడ్డి జిల్లా శాఖ వారు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

గ్రామదేవతల ఆలయాలకు భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతల ఆలయాలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నూతన ఆలయ కమిటీ అధ్యక్షులు గంధ్ర నర్సింలు, ఉపాధ్యక్షులు గాండ్ల సాయిలు, సెక్రెటరీ శివ రాజం, శంకర్ రెడ్డి, శివరెడ్డి, పోతుల రాజేందర్, తిరుపతి, శీల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ దామాషాపై అభిప్రాయాలు తెలపొచ్చు

- 29న నిజామాబాద్‌కు బీసీ కమిషన్ బృందం రాక
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీ.సీ. కమిషన్ ప్రతినిధుల బృందం ఈ నెల 29న నిజామాబాద్ కు విచ్చేయనుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ నెల 29 న నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ సంక్షేమ శాఖ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వారి అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా కమీషన్‌కు సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

మూడు వాయిదాల డీఏ ప్రకటించాలి

- కేబినెట్ నిర్ణయాల నిరాశపరిచాయి
- టిపిటిఎఫ్ కామారెడ్డి జిల్లా శాఖ

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న సిహెచ్ అనిల్‌కుమార్

ఐదు వాయిదాల కరువు భత్యం (డి.ఎ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం, జిఒ 317 సమస్యలపై దాటవేత వైఖరి పట్ల రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నారని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కామారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్ అన్నారు. మూడు వాయిదాల డీఏ ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్యాబినేట్ కమిటీ నిర్ణయాలు నిరాశపరిచినట్టు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 'ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డిఎ విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్దరిస్తామని, జిఒ 317 బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పదినెలలుగా ప్రభుత్వంపై వత్తిడి చేయకుండా ఓపిక పట్టాం. సగం మందికైనా నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తున్నందుకు సంతోషించాం. జిఒ 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినందున సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరిస్తారని ఆశించినవారికి కమిటీ సిఫార్సులు తీవ్ర నిరాశను కలిగించాయ'న్నారు. భార్యాభర్తలు, ఆరోగ్య కారణాలతో బదిలీలకు జిఓలోనే అవకాశం ఉన్నదని, స్థానికత కోల్పోయిన వారి గురించి నిర్ణయం చేయకపోతే కమిటీ వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు గురించి ఊసే లేదన్నారు. రెండేళ్ళుగా వేలాది బిల్లులు క్లియర్ కావటం లేదనీ, వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటిస్తార న్నారు. 'గత కొన్నేళ్ళుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీని పాటించటం లేదు. ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వకుండా పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్టు ప్రకటించటం విడ్డూరంగా ఉందని' తెలిపారు. గత ప్రభుత్వం మూడు వాయిదాలు బకాయి పడితే ఈ ప్రభుత్వం వచ్చాక మరో రెండు వాయిదాలు వచ్చి చేరాయి అన్నారు. కనీసం మూడు వాయిదాల డిఎ అయినా ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్న సందర్భంలో కేవలం ఒక్క వాయిదా డిఎ మాత్రమే విడుదల చేయటంతో ఉద్యోగులు జీర్ణించుకోలేక పోతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పెట్టే ఖర్చులన్నీ పెడుతూనే ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన డిఎలకే ఆర్థిక పరిస్థితి ఆటంకమౌతుందా అని ప్రశ్నించారు. డిఎతో పాటు జిఒ 317 సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున్ణ సమీక్షించుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సమస్యలన్నింటిని కాలయాపన లేకుండా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు.వై సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు డాక్టర్ నాగభూషణం, టి.శ్రీనివాస్ సిహెచ్ లింగం, రూప్సింగ్, నళినీ దేవి, సిహెచ్ లక్ష్మి, విజయ శ్రీ, మీనా భూషన్ డిమాండ్ చేశారు.

ధర్మయుద్ధ మహాసభకు తరలిరావాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు వెంకట్‌రాములు



మాట్లాడుతున్న బట్టు వెంకట్‌రాములు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్సార్ గార్డెన్‌లో జరిగే ధర్మ యుద్ధ మహాసభ కార్యక్రమానికి మాదిగలు మాదిగ ఉపకులాలు పెద్ద సంఖ్యల తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు వెంకట రాములు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి, పి పురుషోత్తం, భరత్, రాకేష్ పాల్గొన్నారు.

ఐటీఐలోని అడ్వాన్స్ కోర్సులను విద్యార్థులు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

బిచ్కుందలోని ఐటీఐలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో 1 సంవత్సరం లేదా 2 సంవత్సరాల 6 కొత్త కోర్సులు ప్రారంభించనున్నారని, కావున 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు లేదా ఇంటర్మీడియట్ చదువు మానేసిన విద్యార్థులకు ఇది సువర్ణావకాశమని తహసీల్దార్ ముజీబ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యం లేని, సెమీస్కిల్డ్ ఉద్యోగులకు అధునాతన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఇది గొప్ప అవకాశంమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రఖ్యాత టాటా గ్రూప్ సహాయంతో ఈ కోర్సులు నిర్వహిస్తున్నారని, అందువల్ల ప్లేస్‌మెంట్‌లు పొందేందుకు గొప్ప అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30 చివరి తేదీ అని, ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి సర్టిఫికేట్, బోనాఫైడ్, కుల ధృవీకరణ, ఆధార్ కార్డుతో బిచ్కుందలోని ఐటీఐ కాలేజీకి వెళ్లాలని, ఇతరాత్ర సమాచారం కోసం 9640228856/ 9866757695 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు.. ప్రారంభానికే పరిమితం



- రైస్‌మిల్లర్‌ల అలాట్‌మెంట్ కాక నిలిచిన తూకం
- వడ్ల కుప్పలతో తిప్పలు పడుతున్న రైతులు
- పాలకులు, అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్‌లో ధాన్యం కుప్పలు

ఈసారి సకాలంలో వర్షం రాకపోవడంతో పంట సాగు నెమ్మదించింది. కానీ మధ్యలో భారీ వర్షాలు కురవడంతో పంటలకు నీరు అందడంతో రైతులు హర్ష వ్యక్తం చేశారు. పంటచేతికి రావడంతో ముమ్మరంగా కోతలు కోసి విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టారు. రైతులు ధాన్యం ఆరబెట్టిందే తడువు.. పాలకులు, అధికారులు హడావుడిగా వచ్చి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇక పంటను విక్రయించుకొని తర్వాత పంటకు సిద్ధమవుదామని రైతులు భావించారు. కానీ తూకం మాత్రం ప్రారంభించలేదు. ఒక రోజు, రెండుమూడు రోజులు ఎదురు చూసినా సప్పుడు లేదు. దీనికి తోడు వాతావరణ మార్పులు.. మధ్యలో వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైస్‌మిల్లలను కేటాయించకపోవడంతో.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడం లేదు. అధికారుల, ప్రజాప్రతినిధుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్లులను కేటాయించి తూకం ప్రారంభించాలని కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 5 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా 396 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారం నుంచి పది రోజులు గడుస్తున్నా తూకం వేయడంలో జాప్యం చేయడం వలన అధికారుల, ప్రజాప్రతినిధుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.

వడ్ల కుప్పలు రైతుల తిప్పలు

ఖరీఫ్ సీజన్లో బోరు బావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సన్న చిన్న కారు రైతులు అధిక మొత్తంలో వరి పంటను సాగు చేశారు. వరి కోతలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్న నేపథ్యంలో ముందస్తుగా వరినట్లు వేసిన రైతులు కోతలు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు తూకం ప్రారంభించలేదు. ముఖ్యంగా జిల్లాలోని నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, లింగంపేట్, మాచారెడ్డి, రాజంపేట, రామారెడ్డి మండలాల్లో ఎక్కువ శాతం రైతులు వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే ఆయా మండలాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా తూకం వేయకపోవడం వల్ల వేలాది క్వింటాళ్ల ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి.

కుప్పల వద్ద కాపలా

ఉదయం నుంచి రాత్రి వరకు వడ్ల కుప్పల వద్ద రైతులు కాపలా కాయాల్సి వస్తుంది. ఇతర పనులు మాని అక్కడే ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమ శాతాన్ని పరిశీలిస్తున్నప్పటికి వడ్ల కొనుగోలు ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు అడిగితే సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాట్మెంట్ రాక అవస్థలు

జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైస్‌మిల్లులకు అలాట్మెంట్ రాకపోవడంతో తూకం వేయలేకపోతున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు సంబంధిత రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం సైతం నిర్వహించారు. అయినా ఇప్పటివరకు నిర్వహించకపోవడంతో తూకంలో జాపం జరిగే అవకాశాలున్నాయి. దీపావళి తర్వాతే తూకం ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మంత్రివర్గ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 5 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 150 రైస్ మిల్లర్లకు తరలించేందుకు జిల్లా స్థాయి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెబుతున్నారు. కానీ అనుమతి రాకపోవడంతో అధికారుల సైతం అవస్థలు పడుతున్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం వచ్చిన అనుమతి వచ్చేవరకు ఆగల్సి వస్తుందన్నారు.

20 రోజులైంది

మనోహర్ భవానిపేట్

కొనుగోలు కేంద్రానికి వడ్లు తరలించి ఇరవై రోజులు అయింది. కాంటా ప్రారంభించలేదు. రోజు పొద్దున వచ్చి రాత్రి వరకు కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తుంది.

సమాధానం చెప్పడం లేదు

రాజారాం లింగంపేట్

వడ్లు పోసిన నుంచి రోజు తేమశాతాన్ని చూస్తున్నారు. కానీ కాంట ఎప్పుడు పెడతారు అని అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. రోజు వడ్ల వద్దనే కాంట ఎప్పుడూ పెడతారు ఎదురుచూస్తున్నాం.

నగరంలో దీపావళి సందడి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలో పండుగ కంటే ముందే దీపావళి సందడి నెలకొంది. నగరంలోని కంఠేశ్వర్, గాంధీచౌక్ ఇతర ప్రాంతాలలో దీపావళి పండుగ సందర్భంగా మట్టి ప్రమిదలను వ్యాపారులు అమ్ముతున్నారు. ప్రమిదలు డజన్‌కు రూ.50 నుంచి 70 వరకు విక్రయిస్తున్నారు. వాటి పరిమాణాన్ని బట్టి అంతకుమించిన ధరతో విక్రయిస్తున్నారు.

డీఏ ప్రకటనతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

నవతెలంగాణ-ముప్కాల్

ఐదు వాయిదాల కరువు భత్యం (డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ నేటి రోజు వరకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ ఒక డీఏ ప్రకటన విడుదల చేయడం విడ్డురంగా ఉందని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పది నెలలుగా ఓపిక పట్టామని పేర్కొన్నారు. వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరునెలలకోసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించబడుతుందని తెలిపారు. గత కొన్నేండ్లుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీని పాటించటం లేదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునసమీక్షించుకోవాలని టిఎస్‌యుటిఎఫ్ ఉద్యోగుల పక్షాన డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య



- రోడ్ల విస్తరణ లేకే ఇబ్బందులు
- పార్కింగ్ స్థలాలు లేక ప్రజల ఇబ్బందులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరుగుతోంది. నగర విస్తీర్ణం, జనాభా పెరుగుతున్నా.. అవసరాలకు తగ్గట్టు రోడ్ల విస్తరణ జరగడం లేదు. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా భవనాలు నిర్మించకపోవడం వలనే పెరిగిన జనాభా, వాహనాల వలన నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలు, నగరం పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వెడల్పు లేకపోవడం వల్ల పనిదినాల్లో, రోజువారీగా నగరం పరిధిలో వాహనాల రద్దీ పెరిగి ప్రధాన రోడ్ల వెంట వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల సంఖ్య భారీగా పెరగడం, రోడ్లపైనే నిలుపుతుండడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడిచిన రెండు దశాబ్దాలుగా నగరంలో నిర్మాణాలు భారీగా పెరిగినా రోడ్ల విస్తరణ జరగకపోవడం వల్ల సమస్యలు తప్పడం లేదు. ప్రస్తుతం ముఖ్యమైన వాటిలో వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులకు వచ్చేవారు ప్రతీరోజు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లు విస్తరించలేక ఇబ్బందులు..

నగరం వేగంగా అభివృద్ధి చెందుతోంది. శివారు గ్రామాలను కార్పొరేషన్‌లో కలపడంతో జనాభా నాలుగు లక్షలు దాటింది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారడంతో నిధులు కూడా భారీగా వస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీతో పాటు ఇతర అభివృద్ధి పనులను పూర్తిచేశారు. మురుగునీటిని మళ్లించే కార్యక్రమాలకు భారీగా నిధులను ఖర్చు చేశారు. నగరం పెరిగినా.. ప్రధాన రోడ్ల విస్తరణ మాత్రం జరగలేదు. ఉన్న రోడ్లపైనే డివైడర్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారు. కొత్త రోడ్లను వేశారు. కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రోడ్లు 120 ఫీట్ల వెడల్పు ఉండాలి. వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో ఈ విస్తరణ తప్పనిసరి. కానీ, నగరంలో ప్రధాన రోడ్లలో ఒకటి రెండు మినహా ఇతర రోడ్లు వెడల్పుగా లేవు. రైల్వేస్టేషన్ నుంచి గాంధీచౌక్‌కు వెళ్లే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణ జరగలేదు. ఈ రోడ్డును ఆనుకుని బోధన్ రోడ్డు, మల్టీప్లెక్స్ రోడ్డుతో పాటు అన్ని వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ప్రధాన వస్త్ర, పండ్లు, కిరాణా, కూరగాయల మార్కెట్‌లు ఇదే రోడ్డును ఆనుకుని ఉన్నాయి. ఈ రోడ్డు వెంట ఖలీల్‌వాడి, హైదరాబాద్ రోడ్డు ఉన్నాయి. పూసల గల్లి, సరస్వతీనగర్, గాంధీగంజ్, ప్రగతినగర్‌తో పాటు ఇతర వీధులు ఉన్నాయి. నిత్యం ఈ ప్రాంతం అంతా ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఇవే కాకుండా నగరం పరిధిలోని వినాయక్‌నగర్, బోధన్ రోడ్డు, ఆర్మూర్ రోడ్డు కూడా రద్దీగా ఉంటుంది. ప్రధానంగా రైల్వేస్టేషన్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డు విస్తరణ జరగలేదు. రోడ్డు వెడల్పు కూడా తక్కువగా ఉంది. హైదరాబాద్ రోడ్డు, ఆర్మూర్ రోడ్డు, బోధన్ రోడ్డు కొంతమేర వెడల్పు ఉన్నా.. నిబంధనల ప్రకారం మాత్రం వెడల్పు చేయలేదు. ఉన్న రోడ్డులోనే డివైడర్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానమైన వాణిజ్య సముదా యాలున్న ప్రాంతాల్లో ఇంటర్నల్ రోడ్ల విస్తరణ జరగలేదు.

పార్కింగ్ స్థలాలు లేవు..

నగరంలో గత 20 సంవత్సరాలుగా నూతన భవనాలు నిర్మిస్తున్నా రోడ్ల విస్తరణ మాత్రం జరగడం లేదు. అనుకున్న విధంగా పార్కింగ్ స్థలాలను వదిలిపెట్టలేదు. ఈ ప్రాంతం సోమవారం నుంచి శనివారం వరకు రద్దీగా ఉంటుంది. నగరంలోని వివిధ అవసరాల కోసం వచ్చేవారు ఈ వాణిజ్య సముదాయాలతో పాటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతారు. వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. పెద్ద పెద్ద భవనాలు ఉన్నా పార్కింగ్ స్థలాలు లేకపోవడం వల్ల రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రద్దీ పెరిగితే గంటల సమయం వెచ్చించాల్సి వస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు, ఆసుపత్రులు నిర్మించినా పార్కింగ్ స్థలాలు వదిలిపెట్టలేదు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణం చేయలేదు. మున్సిపల్ చట్టం ప్రకారం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సాధారణ భవనాలు 30ఫీట్లు, వాణిజ్య సముదాయాలు 40 ఫీట్ల సముదాయాన్ని పార్కింగ్ కోసం వదిలిపెట్టారు. నగరం పరిధిలోని వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు ఉన్న చోట ఎక్కడా సెట్‌బ్యాక్ జరగలేదు. కొన్ని బహుళ అంతస్తుల భవనాలకు సెల్లార్‌లు ఇచ్చినా అవి ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. వచ్చే వాహనాలను ముందే నిలిపి ఉంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ అధికారులపైన పాలకవర్గంలో ఉన్నవారు ఒత్తిళ్లు తేవడం, మాస్టర్‌ప్లాన్‌ను పట్టించుకోకపోవడం వల్ల ప్రస్తుతం నగర ప్రజలు రోడ్ల విస్తరణ జరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పండుగల సమయంలో వాహనాలు నిలిపేందుకు కూడా చోటు లేక వచ్చేవారు. ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం పోలీసులకు కూడా ఇబ్బందికరంగా మారుతోంది. కొత్త మాస్టర్‌ప్లాన్ వచ్చిన తర్వాతనైనా ప్రధాన రోడ్ల విస్తరణ చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని నగరవాసులు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో జనాభా, వాహనాలు మరింత పెరిగి సమస్య తీవ్రం కానుంది. మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గంతో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం దృష్టిపెడితేనే సమస్య పరిష్కారం కానుంది. ఇలా చెప్పుకుంటూ పోతే నిజామాబాద్ నగరంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. అందుకనుగుణంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. కేవలం ఫైన్‌లకు పరిమితమైన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ స్థలాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఈ పరిస్థితులలో కేవలం ట్రాఫిక్ పోలీసుల చేతుల్లో కెమెరా ఉంటే చాలన్నట్లుగా వ్యవహరించడం ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసిన తర్వాతే పోలీసులు ట్రాఫిక్ ఫెనాల్టీలు వేస్తే బాగుంటుందని అదేపనిగా ఎక్కడపడితే అక్కడ పోలీసులు కెమెరాలు పట్టుకుని నిలబడుతున్నారు తప్ప ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఎదురవుతే సుమారు గంట రెండు గంటల పాటు వేచి ఉండక తప్పడం లేదు. అందుకనుగుణంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రారంభమైన అండర్ 14, 19 క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గ్రామంలో గల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు అండర్ 14, 19 ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆర్‌సిఓ సత్యనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనడానికి వివిధ బిసి గురుకుల పాఠశాలల నుంచి పీఈటీలు, విద్యార్థులు, కళాశాలల నుంచి పీడీలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పాండురంగ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి 2005-2006 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంవత్సరం విద్యార్థులకు బోధించిన ఉపాధ్యాయులు హాజరై పూర్వ విద్యార్థులందరితో మనస్ఫూర్తిగా ముచ్చటించారు. పూర్వ విద్యార్థుల మధ్య ఉన్నత స్థాయి స్నేహం, స్మృతులను సజీవం చేస్తూ, అందరూ ఆనందంగా కాలక్షేపం చేశారు. అలాగే పాఠశాలలో విద్య, శ్రేయస్సుకు సంబంధించిన ఎన్నో స్ఫూర్తిదాయక క్షణాలను పునస్మరించుకున్నారు.

రెంజల్ గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయం చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపడుతుండటంతో మండల పరిషత్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథ పాలకుడు విధినిర్వహణలో లేకపోవడంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయం సమయపాలన పాటిస్తూ యువతకు ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అన్నింటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. నేటి సమాజంలో యువత చెడువ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గ్రంథాలయాలు యువతకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట బీసీ సెల్ మండల అధ్యక్షులు లచ్చేవార్ నితీన్, సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్, బోడిగ రవి, ఎల్.కృష్ణ, సల్మాన్‌ఖాన్, శివ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పర్యటించనున్నట్టు పార్టీ నాయకులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫోటో ఎగ్జిబిషన్ "ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలో, అలాగే మాక్లూర్-ఆలూర్ మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ మాక్లూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించేఉ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రభుత్వ కాంట్రాక్ట్ పనుల్లో 93 రిజర్వేషన్ పద్ధతి పాటించాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మెట్రో, ఇరిగేషన్ ప్రాజెక్టులు, మద్యం టెండర్లు, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని జాతీయ రహదారులకు జరిగే తదితర నిర్మాణ పనుల్లో తెలంగాణ సమాజంలో ఉన్న బిసి, ఎస్సీ, ఎస్టీ, మత మైనారిటీలు అగ్రకుల పేదలైన బహుజన ప్రజలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ పద్ధతి ప్రకారం కాంట్రాక్ట్ పనులను కేటాయించాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మాణ పనులకు కావాల్సిన పెట్టుబడి ప్రభుత్వ బ్యాంకులు ఇచ్చే విధంగా ప్రభుత్వ గ్యారంటీతో కూడిన రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులు పూర్తిచేసిన సందర్భంగా బ్యాంకుల ద్వారా బిల్లు చెల్లిస్తారని, కాబట్టి రుణం పొందిన వారు బ్యాంకుల నుంచి పొందిన రుణాలు ఎగ్గొట్టే అవకాశం లేదని దండి వెంకట్ తెలిపారు.



బడుగు, బలహీన పేదలకు

పార్థివ వాహన సేవలు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పార్థివ వాహన సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ మధు కుమార్, కోఆర్డినేటర్ పెంద్యాల శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. బడుగు, బలహీన పేదలకు వైకుంఠరథం వరం అని, పేదలు మరణిస్తే వేలకు వేలు పెట్టి చేరలేని దీన పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయని అన్నారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ వాహనాలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. ఈ వాహనాల వల్ల పేదలకు ఇక్కట్లు కొంతవరకు దూరమవుతాయని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో చనిపోయిన మృతదేహాలను ఉచితంగా ఎలాంటి డబ్బులు తీసుకోకుండా వారి ఇంటికి ఆ పార్థివ వాహనాల ద్వారా తరలిస్తామని తెలిపారు. ఎవరైనా పేదవారు మరణిస్తే వేలకు వేలు డబ్బులు పెట్టి మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లాలంటే అధిక ఖర్చుతో కూడుకున్న విషయమని.. ఆ స్తోమత లేనివారికి ఈ పార్థివ వాహన సేవలో వారిని చేర్చడానికి ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు.

24 గంటలు అందుబాటులో



ఈ సేవలు పొందాలంటే 108 లేదా ఆస్పత్రి సూపరింటెండెంట్ వారి ద్వారా ఈ సేవలు పొందవచ్చు. ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయి.

- మధుకుమార్, ప్రోగ్రాం మేనేజర్, నిజామాబాద్

పేదలు వినియోగించుకోవాలి



నేడు పేద ,మధ్యతరగతి ప్రజల జీవన విధానం కడుదయనీయం .ఈ పార్థివ వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- పెంద్యాల శ్రీకాంత్, కోఆర్డినేటర్, నిజామాబాద్.

అలరించిన సంగీత విభావరి

- నాదబ్రహ్మకు సుస్వరాల నివాళి



పాటలు పాడుతున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లోని శ్రీ రామాలయంలో శ్రీనివాస్ ప్రతాప, గౌరీ ప్రతాప్ కుటుంబ వంశస్థుల ఆధ్వర్యంలో ప్రతాప అన్నపూర్ణా, రామకృష్ణయ్య జ్ఞాపకార్థం ఆదివారం త్యాగరాజు కీర్తనల ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంగీత విద్వాంసులు వారి సంగీతంతో సంగీతామృతం కురిపించారు. కార్యక్రమంలో సంగీత కచేరీ ఆద్యంతం ఆకట్టుకుంది. లయ బ్రహ్మ, నాద బ్రహ్మ, సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలు సంగీత ప్రియులను ఆద్యంతం అలరించాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి శేషతల్ప సాయి, అతిథులుగా పట్టణ సీఐ వెంకటనారాయణ, ప్రముఖ కళాకారులు రాకేష్ వైద్య, యాదవరావు, కాసర్ల నరేష్, సంగీత విద్వాంసురాలు స్వప్నా రాణి, గౌరీ శంకర్ శాస్త్రీ, శ్రీనివాస్, సత్యసాయి, ఉదయశ్రీ, దీప్తిశ్రీ, నిజామాబాద్ డాక్టర్ స్వప్న, రామానుజాచారి, దంపతులు వారి శిష్య బృందం తదితరులు పాల్గొన్నారు. 100 మంది సంగీత విద్వాంసులు తమ గానంతో అలరించారు.

టపాకాయల వ్యాపారులు

పోలీసు అధికారుల అనుమతి పొందాలి

- నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు
- ఏసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్



వ్యాపారులతో మాట్లాడుతున్న పోలీసులు

టపాకాయల వ్యాపారస్తులు తప్పనిసరిగా సంబంధిత డివిజనల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టపాకాయ దుకాణ వ్యాపారులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేసేవారు సంబంధిత పోలీస్ డివిజనల్ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. లేనియెడల టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేస్తే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్టు-1884, 1933 సవరణ 2008 ప్రకారంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. టపాకాయల దుకాణాదారులు ఖాళీ ప్రదేశాలలో దుకాణాలు ఏర్పాటు చేయాలని ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్.ఓ.సి సర్టిఫికెట్ పొందుపర్చాలని, ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించవద్దని సూచించారు. జనం రద్దీగల ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల షాపుల ఏర్పాటు చేయవద్దని సూచించారు. అలాగే కళ్యాణ మండపాలలో, సమావేశాల కేంద్రాలలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. తాత్కాలిక టపాకాయల దుకాణాలలో ఫైర్‌కు సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వెంకటనారాయణ ఉన్నారు.

పట్టణంలో 'స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ'



శ్రమదానం చేస్తున్న కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సుంకె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ కాలనీ సమైఖ్య కాలనీ కార్యక్రమం ఆదివారం 67వ వారానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయం చుట్టుపక్కల శుభ్రపరిచి రోడ్డుకు ఇరువైపులా ఇంటి యజమానులు రాళ్లు పెట్టి రోడ్డును ఇరుకుగా చేస్తే ఆ రాళ్లను తొలగించి వచ్చి పోయేవారికి ఆ సౌఖర్యాన్ని తొలగించారు. పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించి మురుగు కాల్వలు శుభ్రం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి కుమార స్వామి, కొక్కెర భూమన్న, గడ్డం శంకర్, ఎర్ర భూమయ్య, కొంతం రాజు, గణేష్, రాజ్‌కుమార్, అందాపూర్ సాయన్న, జీవన్, సుంకె నిశాంత్ కుమార్, కేవీ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోలో హెూమ్ డెలివరీ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు ఆర్.టి.సి. కార్గో హెూమ్ డెలివరీ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని ఏటిఎం పాల్ తెలిపారు. తెలంగాణా రాష్ట్ర ఆర్.టి.సి. కార్గో సేవా విభాగం ద్వార నడపబడుతున్న ఆర్.టి.సి. కార్గోలో ఈనెల 27 నుంచి హైదరాబాద్, జూబ్లీ బస్‌స్టేషన్‌కు సంబందించిన 31 కౌంటర్‌లలో (సిటీ పరిసరాలచుట్టూ) కొరియర్ సేవలను వినియోగదారులకు హెూమ్ డెలివరీ అందించబడుతుందని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిజామాబాద్ నుండి హెూమ్ డెలివరీ మొదటగా బుక్ చేసుకున్న వారు డి.కవిత అని అన్నారు. 0-1కిలో రూ.50. 1-5 కిలో రూ.60, 5-10 కిలో రూ.65, 10-20 కిలో రూ.70, 20-30 కిలో రూ.75, 30కిలో పైన రూ.75 (కాంబినేషన్ ఆఫ్ శ్లాబ్) అని వివరించారు. మరింత సమాచారం కోసం ఆర్మూర్ డిపో 7396889496, బోధన్ డిపో 9014296638, నిజామాబాద్-1 డిపో-9154298727, నిజామాబాద్-2 డిపో 7396889496, బాన్సువాడ డిపో 9154298729, కామారెడ్డి డిపో 9154298729, ఆర్.యం. ఆఫీసు 8639963647ను సంప్రదించాలని సూచించారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈ నెల 29న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేరుకొనే విషయంలో ఆసక్తి కలిగిన పార్టీలు సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను బీసీ కమిషన్‌కు తెలియజేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభ్యంతరాలను వ్యక్తిగతంగా తెలియజేయాలని పేర్కొన్నారు. అన్ని రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలు, మొదలగునవి కమిషన్ చైర్మన్ లేదా సభ్య కార్యదర్శి పేరిట వ్యక్తిగతంగా కమిషన్ ప్రత్యేక అధికారికి సమర్పించవచ్చని సూచించారు. లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా కమిషన్ కార్యాలయం హైదరాబాద్ నందు నవంబర్ 13న సాయంత్రం 5గంటలలోపు చేరుకునే విధంగా పంపించాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | అక్టోబర్ 28, 2024 | www.navatelangana.com

ఉత్తమ పురస్కారానికి దరఖాస్తు చేసుకోండి

- తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమల్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ప్రైవేటు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. త్వరలో నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్స్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షులు చందర్ లాల్ ఆదేశాల మేరకు ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8500662726 ఫోన్ నెంబర్‌కు సంప్రదించి, ప్రైవేటు ఉపాధ్యాయులు తమ పూర్తి వివరాలను తెలియజేయాలని కోరారు.

పారిశుధ్యం పగటికలేనా..?

- అపరిశుభ్రంగా గ్రామాలు

నవతెలంగాణ-బీబీపేట్



మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ వెనుకభాగంలో..



మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రయినేజీల దుస్థితి

మండలంలోని పలు గ్రామాలలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల మాటలు నీటిమూటలుగానే మారుతున్నాయి.

ప్రస్తుతం గ్రామాలలో పారిశుధ్య లోపంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి అనేక రోగాలు ప్రబలుతున్న సంగతి తెలిసిందే. మండలంలో గత ప్రభుత్వ హయాంలో కొంతవరకు సిసి రోడ్ల నిర్మాణం, మురికి కాలువలు నిర్మించినప్పటికీ ఆ మురికి నీటిని ఎక్కడ వరకు చేరవేయగలిగితే సమస్యలు తలెత్తకుండా ఉంటాయో అన్న కనీస అవగాహన లేకుండా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు వారి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. మురికి కాలువలలో మురికి నీరు స్తంభిస్తున్న ప్రాంతాలలో దోమ మందులు, బ్లీచింగ్ పౌడర్‌లను చల్లవలసి ఉండగా తూతూమంత్రంగా నాలుగైదు రోజులు దోమల పొగను మండల కేంద్రంలో స్ప్రే చేశారు. కానీ మురికి కాలువలలో పందులు మురికి నీరు నిలువ ఉండే స్థలాలలో దోమల మందు పిచికారీ చేయడం మరిచారు. ఇకనైనా ప్రజల ఆరోగ్యం పట్ల నైతిక బాధ్యత కలిగి వ్యవహరించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

ఇక మండల కేంద్రంలోని దళితవాడలో మురికి కాల్వల నిర్మాణం కొంతవరకు మాత్రమే జరిగింది. రెండు అంగన్వాడీ కేంద్రాల వద్ద నుంచి ఎస్సీ హాస్టల్ ముందర ఉన్న రైతు వేదిక వరకు ఉన్న మురికి కాలువలో మురికి నీరు స్తంభించి దోమలు, ఈగలు, పందుల బెడద వల్ల ప్రాంత ప్రజలకు అనేక రోగాల బారిన పడే విధంగా కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మిక విభాగంలో సరిపడా కార్మికులు లేక పారిశుధ్యం కుంటుపడుతోంది. మహాత్మ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహం వద్ద మురికిని వేసి దాన్ని తొలగించి ఆ స్థానంలో కనీసం బ్లీచింగ్ చల్లే పరిస్థితుల్లో కూడా గ్రామపంచాయతీ లేనట్లుగా వ్యవహరిస్తుంది. ఇదే మండల కేంద్రంలోని మసీదు వద్ద పైపులైన్ లీకేజీ అయి నీరు ఉబికి వస్తున్నా.. దాన్ని గుంత తవ్వి వదిలేశారు. దానికి తోడు అక్కడే చెత్త వేస్తుండటంతో పేరుకుపోయింది. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వద్ద హాస్టల్ సిబ్బంది వ్యర్థాలను సమీపంలో ఉన్నటువంటి మురికి కాలువలో వేయడంతో ఆ మురికి కాలువ అపరిశుభ్రంగా తయారైంది. అధికారులు స్పందించి గ్రామాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో టీవీల చోరీ



నిందితుడిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్ఈడి టీవీలను ఎత్తుకెళ్లిన నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న ప్రయాణికుడి దగ్గర నుంచి ఎల్ఈడీ టీవీలను ఎత్తుకెళ్లిన కేసులో మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన శంకర్ నాగూరావును అరెస్ట్ చేసినట్టు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 26న ధర్మాబాద్‌కు చెందిన మాధవప్ప నిజామాబాద్‌లో 32 ఇంచుల రెండు ఎస్ఈడీ టీవీలు కొని స్వస్థలానికి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రాత్రి కావడంతో బుకింగ్ కౌంటర్ వద్ద టీవీలు పక్కన పెట్టుకొని నిద్రించాడు. ఈ క్రమంలో స్టేషన్‌లోకి వచ్చిన శంకర్ నాగూరావు మాధవప్ప పక్కన ఉన్న రెండు టీవీలను ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం ఒకటో నంబర్ ప్లాట్ ఫాంపై శంకర్ నాగూరావు టీవీలను చేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఐడీ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, తాను టీవీలు చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ఆర్ఎస్సై ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మోపాల్

శ్రీ సిగ్మా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండలంలోని కులాస్పూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. 250 నుంచి 300 ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసి బీపీ, షుగర్ టెస్టులను చేశారు. ఈ సందర్భంగా గడీల శ్రీరాములు మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన సిగ్మా హాస్పిటల్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. అన్ని రకాల ఇన్సూరెన్స్ సేవలను ప్రారంభించామని సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ కృష్ణ కిషోర్‌రెడ్డి కార్డియాలజీ విభాగంలో అత్యున్నత వైద్య సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నాగరాజుగౌడ్, డాక్టర్ల బృందం, కార్డియాక్ డాక్టర్ దిలీప్, న్యూరో సర్జన్ డాక్టర్ చక్రవర్తి, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ డాక్టర్ వెన్నెల, అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ సర్జన్ డాక్టర్ పారాసు జైన్, నర్సింగ్ సూపరింటెండెంట్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఇంటిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై దౌర్జన్యంగా దాడి చేయడం ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కారణం, వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడ ఏదో జరిగితే అది కేటీఆర్‌కు ఏం సంబంధం అని తెలిపారు. రేవంత్ సోదరులపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, రేవంత్ సోదరుల ఇళ్లపై పోలీసులకు ఇలాగే చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. స్వయంగా పోలీసులే రేవంత్ తమ్ముడితో సెటిల్ చేసుకోమ్మని బాధితులకు చెబుతున్నారని, కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న నాటకమని తెలిపారు. పై నుండి మోడీ, ఆదానీలే రేవంత్ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని పేర్కొన్నారు. నిజాం కాలంలో కూడా ఇంతలా దుర్మార్గంగా పనిచేయలేదని, చిల్లర దాడులు మమ్మల్ని బయపెట్టలేవని, అరెస్టులు కొత్తకాదని తెలిపారు. ఎఫ్ఐఆర్, సెర్చ్‌వారెంట్ లేకుండా ఎలా సోదాలు చేస్తారని ధ్వజమెత్తారు.

ప్రతి ఒక్కరినీ ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

- మండల విద్యాధికారి రాజగంగారాం



చలం దంపతులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్కరినీ ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని మండల విద్యాధికారి రాజా గంగారాం అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామ్‌మందిర్ ప్రధానోపాధ్యాయులు జి.ఎల్.చలం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిని చదువుతో పాటు క్రమశిక్షణను నేర్పుతూ ఉన్నత స్థాయికి చేర్చేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ నరసయ్య, నరేందర్, వనజ, రవీందర్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- రెండు గేట్ల నుంచి దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల



నవతెలంగాణ-మెండోరా

ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయని శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 15,702 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం అవుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ప్రాజెక్టు స్పిల్ వే 2 గేట్లు ఎత్తి దిగువకు 6,228 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల నుంచి 8000 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500, లక్ష్మీ కాలువకు 150 , మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తుండగా ప్రాజెక్టు నుంచి 773 క్యూసెక్కుల నీరు వృథాగా ఆవిరి అవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

డాక్టర్ బాపురెడ్డి కన్నుమూత

- ప్రముఖ వైద్యుడిగా గుర్తింపు
- ఐఎంఏలో పలు పదవులు
- భౌతికకాయానికి నివాళులర్పించిన రూరల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్/మోపాల్



బాపురెడ్డి (ఫైల్)

ప్రముఖ వైద్యుడు డాక్టర్ జాల బాపురెడ్డి(75) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా లివర్ సెల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న డా.బాపురెడ్డి శనివారం రాత్రి హైదరాబాద్‌లో చనిపోయారు. ఫిజీషియన్‌గా నాలుగు దశాబ్దాలకు పైగా వైద్య సేవలందిస్తున్న బాపురెడ్డి నిజామాబాద్ జిల్లాలో సుపరిచితుడు. పూర్వపు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన డా.బాపురెడ్డి నిజామాబాద్ కేంద్రంగా ఎం.డి. ఫిజీషియన్ వైద్యుల్లో ప్రముఖులు. డా.బాపురెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో బాపురెడ్డి ఒకరు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు నిజామాబాద్ జిల్లాలో బాపురెడ్డి అత్యంత ఆప్తుడు. టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లారు. బీజేపీ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీజేపీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు సమన్వయకర్తగా పనిచేశారు. ఐఎంఏలోనూ పలు పదవులు అలంకరించారు. డా.బాపురెడ్డి మృతిపట్ల వైద్యులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కరుడుగట్టిన తెలంగాణ వాది..

తెలంగాణ అంటే తన ప్రాణం, తెలంగాణను ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేని శక్తి, వ్యక్తి అతనే తెలంగాణ వాది నిజామాబాద్ తెలంగాణ బాపన్న (డాక్టర్ బాపురెడ్డి) అని తెలంగాణ జేఏసీ నాయకులు గోపాల శర్మ, వి.ప్రభాకర్, గైని గంగారాం, భాస్కర్, మోహన్, నజీర్, మాధవ్ ఆదివారం తెలిపారు. క్యాన్సర్ వ్యాధితో పోరాడి ఆదివారం అందర్నీ వదిలి భౌతికంగా దూరమయ్యాడని తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్న తెలంగాణ అందులో నిజామాబాద్ అభివృద్ధి గురించి ఆలోచించేవాడని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజలతో సుదీర్ఘకాలం సంబంధమున్న బాపురెడ్డి ఇకలేరని, తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటిస్తుందని తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ధైర్యంగా ఉంటామని తెలంగాణ జేఏసీ నాయకులు తెలిపారు.

డాక్టర్ బాపురెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే..

మోపాల్ : డాక్టర్ బాపురెడ్డి పార్థివ దేహానికి హైదరాబాద్‌లోని కోంపల్లిలోని ఆయన నివాసంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, అలాగే ఆయన వైద్యవృత్తికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అలాగే బాపురెడ్డి కుటుంబాన్ని ఓదార్చారు.



డాక్టర్ బాపురెడ్డితో జేఏసీ నాయకులు



మోపాల్ : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' జరుపుకున్నట్టు పూర్వ విద్యార్థులు నిమ్మల శ్రీనివాస్, మగ్గిడి ముత్యం రెడ్డిలు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆనాటి గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంలో మునిగితేలారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు కొండ్ర ధన్‌పాల్, గంగాధర్, సాయిరెడ్డి, సుభాషిణి తదితర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహలక్ష్మి కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని అంబం (వై) గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ ఆదేశాల మేరకు ఇందిరమ్మ గృహలక్ష్మి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఆంబం (వై) మాజీ ఉపసర్పంచ్ సున్నపు ఓడ్డెన్న తెలిపారు. సున్నపు లత, బిసి (డి), గోస్ స్వరూప, ఎస్సీ (సి), కంకెల్లి గంగాధర్ ఎస్సీ, (సి), కొండెంగల కాకయ్య బీసీ(ఏ), జెల్లా హన్మాండ్లు, బిసి (ఏ) లను పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకొని తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు. ఇంద్రమ్మ గృహలక్ష్మి కమిటీ కార్యవర్గాన్ని ఎడపల్లి తహసీల్దార్ ధన్వల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులను కోరారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు రావుట్ల స్వామిగౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులుగా నియామకమైన రావుట్ల స్వామిగౌడ్‌ను కౌడిన్య గౌడ సంఘం అధ్యక్షులు నటరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న స్వామిగౌడ్ ఇదే పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని నటరాజ్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఈ పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని రావుట్ల స్వామిగౌడ్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేయబోయే అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌడిన్య గౌడ సంఘం అధ్యక్షులు నటరాజ్‌గౌడ్, అంజాగౌడ్, స్వామిగౌడ్, చంద్రగౌడ్, రామ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.